# మోడల్

స్వప్నరాగలీన

వర్షం కురిసిన సాయంకాలం... ఇంటి ముందు పూల తోట వెలిసిన వర్షపు బిందువులతో ఆహ్లాదంగా వుంది. చినుకులు చేసిన అల్లరి గుర్తొచ్చి సిగ్గుపడుతున్నట్టున్నాయి పూలు. గడ్డి పరకల చివర నీటిపూలు పూసినట్టు మెరుస్తోంది పచ్చిక. ఒకసారి తోటంతా తిరిగొచ్చి ఓ గులాబీ మొక్క దగ్గర ఆగిపోయాను. ఒకే ఒక చిన్ని గులాబీ పూచి వుంది. లోకంలోని అమాయకత్వం,అందం తనలోనే దాచుకున్నట్టుంది. ఆ గులాబీ బాల వైపే చాలాసేపు చూస్తూ ఉండిపోయా నేను.

'అందం ఒక అద్భుతం...ఎప్పటికీ చెరిగిపోదు' అనుకున్నాను ఫిలాసఫికల్‌గా ఆలోచిస్తూ కానీ...

రెండవరోజు సాయంత్రం అలవాటుగా పూలతోటలోకి వెళ్ళాను. గుండెను పిండేసినట్టయింది. ఆ మొక్క చుట్టూ రాలి ఉన్న గులాబీ పూరెక్కలు ...చనిపోయిన సీతాకోకరెక్కలల్లే...'ఓహ్... ఎంత అందాన్నయినా కాలం విచ్ఛినం చేస్తుంది.'

బొమ్మ గీద్దామని క్యాన్వాస్ ముందు కూర్చొని ఆలోచిస్తున్నాను...కానీ రాలిన పూలరెక్కలే మళ్ళీ మళ్ళీ కళ్ళలో కన్పిస్తూ...నేను మరిచిపోతున్న...లేక మరిచిపోయిన ఆ అమ్మాయిని కళ్ళ ముందు సాక్షాత్కరిస్తున్నాయి.... అవును ...ఆ అమ్మాయి ఈ పూలరెక్కలు...ఎక్కడో దగ్గరి పోలిక...

నా చిన్ననాటి మిత్రుడు సాత్విక్..విచిత్రమైన మనిషి. సొంత వూరిలో అన్నీ అమ్ముకుని 'యాడ్ డైరెక్టర్‌గా సెటిలవ్వాలని హైదరాబాద్‌కొచ్చేశాడు. ఊరికే రాలేదు, పట్టుదలతో వచ్చాడు. గుండెలో లావాలా పొంగుతున్న ఆలోచనలకు ఒక రూపం ఇవ్వటానికి వచ్చాడు, వస్తూనే తన మనసుని నా దగ్గర విప్పాడు.

"చూడు రవీ...ఇప్పుడొస్తున్న యాడ్ ఫిల్ములన్నీ సుద్ద వేస్టు...ఎక్కడా లింక్ లేకుండా తీస్తున్నారు. నేను వీటికి భిన్నంగా అద్భుతమైన యాడ్‌ఫిల్మ్ తీయదలిచాను. నేనొక అగర్‌బత్తి కంపెనీతో మాట్లాడి వచ్చాను. నాసొంత డబ్బుతో నేనే తీసి వాళ్ళకు ఇస్తాను. అది సక్సెసయితే....నేనిక్కడ చరిత్ర సృషించినట్టు....లేదంటే ఊరెళ్ళిపోతాను"

వెర్రివాడిలా చూస్తుండిపోయాను.

"సరే నేనొక బొమ్మ చెప్తాను. దాని దృష్టిలో పెట్టుకొని గీసిపెట్టు" అన్నాడు సాత్విక్. నేను తెల్లమొహం వేస్కుని అలాగే వింటున్నాను."పసితనంపోని ఓ పన్నెండేళ్ళ అమ్మాయి. దేవత రూపంలో సరిగ్గా సరిపోవాలి.ముఖంలో అమాయకత చూపులో కరుణ వెలుగుతూ ఆమెను చూస్తూనే భక్తిరసముట్టిపడాలి.నువ్వు గీసే బొమ్మను బట్టి అలాంటి అమ్మాయిని వెతికి తెస్తానేను. ఫిల్మ్‌లో ముందు నీ బొమ్మ కన్పిస్తుంది. అగరువత్తి ధూపం నీ బొమ్మలోని దేవత రూపం చుట్టూ తిరగగానే ఆ బొమ్మ దేవత ఫ్రేమ్ లోంచి లేచివస్తుంది..." అలా కలల్లోకి జారిపోతున్న సాత్విక్‌తో అన్నాను "నేనిప్పటి వరకు ఇలాంటి అమ్మాయిని చూడనేలేదు" సాత్విక్ వైపు వింతగా చూస్తూ అన్నాను.

నావైపు నవ్వుతూ చూశాడు. "నువ్వు బొమ్మ గీసి చూపించు...ఆ రూపవతి.. ఆ పసిలావణ్యవతిని వెతికి పట్టుకొచ్చే బాధ్యత నాది. నా ఊహలోని ఆ అమ్మాయి నీ కుంచె అంచునుంచి జాలువారే ఆ అందాల భరిణెను...ప్రపంచమంతాగాలించయినా తెస్తాను.చూసే చూపు కాదు అన్వేషించే హృదయం ఉండాలి." ఈ సారి సాత్విక్ ముఖంలో విక్రమార్కుడు కన్పించాడు.

సరే అన్నాను. వారం రోజుల్లో బొమ్మ పూర్తి చేసి సాత్విక్‌కు చూపించాను. బొమ్మ చూసి ఎగిరి గంతేసేంత పనిచేసి కౌగిలించుకున్నాడు.

"రవీ...సరిగ్గా నా ఊహల్ని రంగుల్లో మార్చి నా ఆలోచనల్ని ప్రతిబింబించావు. థ్యాంక్యూ" అన్నాడు.

"కానీ...సాత్విక్ నామాటవిను ఈ బొమ్మలో ఉన్న అమ్మాయి నిజంగా ఉండటం కష్టం. మేకప్ వేయించి ఎవరో ఒకరి చేత ఈ అమ్మాయి పాత్ర పూర్తి చేద్దాం."

"నో...నేనలాంటి అమ్మాయిని ఖచ్చితంగా వెతికి పట్టుకొస్తాను...అలాకాని పరిస్థితిలో నేనీ యాడ్ ఫిల్మ్ తియ్యనే తియ్యను" అని బయటకెళ్ళిపోయాడు. ఆ తర్వాత చాలా రోజుల వరకు తను కన్పించలేదు. ఆ బొమ్మలోని అమ్మాయి కోసం...రోడ్లు..గల్లీలు, మురికివీధులు మేడలు మిద్దెలు అన్నీ వెతుకుతూ తిరుగుతున్నాడని తెలిసింది.



ఒకరోజు తెల్లవారుఝామునే సాత్విక్ నుంచి ఫోన్-"రవీ నువ్వెంటనే హోటల్‌కిరా...నేనా అమ్మాయిని తెచ్చాను" అన్నాడు. నేనింకేదో అడిగేలోగా... "చాలా తొందరగా రావాలి" అని ఫోన్ పెట్టేశాడు.


ఆ అమ్మాయి ముందు నిలబడిన నేను ...నా జీవితంలో మొట్టమొదటి సారిగా షాక్‌కు గురయ్యాను....ఆ అమ్మాయి అచ్చు నేను గీసిన బొమ్మలోంచి లేచివచ్చిన దేవతలా ఉంది. పన్నెండు పదమూడేళ్ళుంటాయి. ముఖంలో అమాయకత, చూపులో కరుణ వెలుగుతూ... భక్తి రసముట్టిపడేలా...వాహ్ ఇది కలో నిజమో నమ్మలేనట్టు విగ్రహమయి పోయానలాగే...!

షూటింగ్ మొదలయి నిరాటంకంగా పూర్తయ్యింది. కానీ యాడ్ ఫిల్మ్ ప్రపంచంలో ఒక సంచలనం రేపుతుందనుకున్న సాత్విక్ ఊహ తలకిందులయ్యింది. యాడ్ గురించి..యాడ్ తీసిన పద్ధతి గురించి విమర్శకుల దగ్గర పాస్ మార్క్‌లు వేసుకున్నా మార్కెట్లో పెద్దగా టాక్ రాకపోవడంతో అగర్‌బత్తి కంపెనీ వాళ్ళు దాన్ని రిజెక్ట్ చేశారు. సాత్విక్ ఏడ్చేశాడు. తనను చూసి జాలేసింది. ఓదార్చే ధైర్యంకూడ చేయలేకపోయాను. వస్తున్న అడ్వర్‌టైజ్‌మెంట్లకు భిన్నమైనదేదో చేయాలనుకుని, ప్రకటనల జాతకాన్నే మార్చేయాలని అన్నీ అమ్ముకుని వచ్చి... ఏమీ లేకుండా వొట్టిచేతుల్తో తిరిగి ఊరెళ్ళిపోతున్న సాత్విక్‌ని చూస్తూ ఉండిపోయాను.

**అయితే..మేము సృష్టించిన బొమ్మ గురించి మేమిద్దరం మరిచిపోవటం ఒక ఘోరమైన తప్పని మాకు తెలీదప్పుడు.**

* * *

దాదాపు పన్నెండేళ్ళ తర్వాత సాత్విక్ మళ్ళీ నన్ను కలుసుకున్నాడు. ఈ మధ్య కాలంలో ఆర్థికంగా నిలదొక్కుకోవడమేకాక ఎంతో కొంత లాభాలార్జించి వచ్చాడు. మళ్ళీ యాడ్ ఫిల్మ్ తీయటానికే వచ్చాడని తెలిసి ఆశ్చర్యపోయాను. అయితే తన ఆలోచనలు పూర్తి భిన్నంగా ఉండటం గమనించాను. బహుశా గతం



గాయం చేయబట్టి వ్యతిరేకదిశలో ఆలోచిస్తున్నట్టనిపించింది. తనే ముందు పెదవి విప్పాడు.

"నాకు కొన్ని స్కెచ్‌లు గీసిపెట్టాలి నువ్వు. ఒక పాతికేళ్ళ స్త్రీ...ఆమెను చూడగానే ఒక రఫ్ అండ్ టఫ్ క్యారెక్టర్ అని తెలిసిపోతుండాలి చూసేవారికి."

నేను ఉలిక్కి పడ్డాను. సాత్విక్ ఆలోచనల్లో సాత్వికత లేనే లేదు. మనిషి ఎంతకాదన్నా ఇంతలా మారిపోగలడా?!

"కానీ...ఇదంతా ఎందుకు..?" ఆశ్చర్యంలోంచి కోలుకోకుండానే అడిగాను.

"వేశ్యల మీద ఒక యాడ్. గవర్నమెంట్ తరపునుంచి వచ్చిన అవకాశమిది..."

'పన్నెండేళ్ళ క్రితమైతే ఇలాంటి యాడ్ తయారు చేయటానికి తను ముందుకొచ్చేవాడా?' నా ఆలోచనల్ని కట్ చేస్తూ చెప్పాడు.

"ఆమె తాగుతుంది...తిరుగుతుంది...జూదమాడుతుంది గూండాలతో రోడ్ల మీద కొట్లాడుతుంది."

"ఇలాంటి క్యారెక్టర్‌కి మోడల్ దొరుకుతుందా మనకు?" అడిగా నేను.

"ఎందుకు దొరకదు. నేను వెతికి పట్టుకొస్తా" అప్పటి ఆలోచనలు లేకపోయినా పట్టుదల మాత్రం అలాగే వుంది తనలో.

"సరే వెళ్తానిక" లేచాడు తను.

"ఓకే బెస్టాఫ్ లక్" చేయందించాను.

రెండు రాత్రులు కూర్చొని స్కెచెస్ పూర్తి చేసి సాత్విక్‌కి చూపించాను. మౌనంగా చూశాడు. బావున్నాయన్నట్టు తల ఆడించి "ఇక నేను మోడల్‌ని వెతికి తెస్తాను" అని వెళ్ళిపోయాడు. ఒక పదిహేను రోజుల తర్వాత తన నుంచి పిలుపు అందుకుని సాత్విక్ ఉంటున్న హోటల్ రూమ్‌లోకి అడుగుపెట్టాను. తను తాపీగా సిగరెట్ తాగుతున్నాడు. తను సిగరెట్ తాగటం మొదటిసారి చూస్తున్నాను

"హాయ్ రవీ...మన మోడల్ రెడీ. నోయ్..."

"ఎవరు...?"

"ఎవరో...ఎక్స్‌ట్రాలేసే యాక్ట్రెస్...కానీ అచ్చు మనక్కావలసిన మోడల్‌కి సరిపడే బ్యాడ్ హ్యాబిట్స్ తన రియల్ లైఫ్‌లో ఉన్నాయి. రేపు సాయంత్రం రమ్మన్నాను...నువ్వే చూడు" అన్నాడు వెనక్కి వాలి ఎంతో రిలాక్స్‌డ్‌గా.

* * *

రెండో రోజు సాయంత్రం సాత్విక్ రూమ్‌కెళ్ళాను. ఆమె ఇంకా రాలేదు. సాత్విక్ చైన్ స్మోకర్‌గా మారాడని ఈ రోజు గమనించాను.

అవీ ఇవీ మాట్లాడుతున్నా ఆమె రాక కోసమే ఇద్దరం ఎదురు చూస్తున్నాం. సాత్విక్ ఎదురుగా టేబుల్ మీద ఉన్న ఆల్బమ్ తీసి చూస్తున్నాను. తన మొదటి యాడ్ ఫిల్మ్ ఫోటోలవి.

అంతలో పెద్ద శబ్దంతో తలుపు తెరుచుకోవడంతో ఉలిక్కిపడిచూశాను. ఒక స్త్రీ లోపలికి వచ్చింది. విచిత్రమైన తన కళ్ళతో... మోహాకరమైన చూపులు విసుర్తూ... తడబడే అడుగులతో వస్తూ... దృష్టి నా వైపు తిప్పింది. ఆమె వైపు చూడలేక కళ్ళు నేలకు దించుకున్నాను. టేబుల్ మీదున్న సిగరెట్ ప్యాకెట్ అందుకుని నోటితోనే ప్యాకెట్‌లోంచి సిగరెట్ అందుకుని నా పక్క కుర్చీలో ధబ్‌మని కూర్చుంది.

సాత్విక్ వైపు చూస్తూ...

"కొంచెం లేటయింది" వాలిపోతున్న కనురెప్పలెత్తి భారమైన గొంతు విప్పిందామె. ఆల్కహాల్ వాసన గదిలో గుప్పుమంది. ఇష్టం లేకపోయినా ఆమె వైపు చూశాన్నేను. పసుపు పచ్చటి ఛాయే...కానీ స్త్రీ నన్న భావన ఏ కోశానా లేదు. పొడవాటి కురులే... ఆలనా పాలనా లేనట్టు గాలికెగుర్తూ ...ఓ క్రమాన్ని మర్చిపోయాయి. వయసు ఇరవై నాలుగూ ఇరవై అయిదుకు మధ్య ఉంటుంది. సాత్విక్‌తో ఏవేవో మాట్లాడుతుంది. నాకేదో అనీజీగా ఉంది. ముళ్ళ మీద కూర్చున్న భావన. 'స్కెచ్'లు గీసేటపుడు కుంచె ఎంత అలవోకగా కదిలిపోయింది. తీరా నేను గీసిన బొమ్మ నా పక్కన కూర్చుంటే భరించటం కష్టమవుతూంది. కానీ...ఏదో కలత... ఈమె కళ్ళలోని కసి నా గుండెల్ని కలచి వేస్తుంది. ఎందుకు...?ఎందుకు...? ఒక బొమ్మకు ఆర్టిస్టుకు ఉన్న సంబంధమే కాక ఇంకా ఏదో...ఉంది...ఏమిటీ...ముందు ఇక్కణ్నుంచి పారి పోవాలనుంది. బహుశా సాత్విక్ నా మనోభావాన్ని గమనించాడేమో తనకు పరిచయం చేశాడు.

"మీకు చూపించిన స్కెచెస్ గీసిన ఆర్టిస్ట్ రవీ ఇతనే"

"ఆఁ నేను లోపలకి వస్తూనే గుర్తుపట్టాను" నా వైపు చూడకుండానే చెప్పి మళ్ళీ తనతో మాటల్లో పడిపోయింది. ఇక ఏంచేయాలో తోచక మళ్ళీ ఆల్బమ్ తిరగేస్తున్నాను. ఆమె మాటలతో విసుగెత్తిన సాత్విక్ కూడా ముందుకు వంగి నేను చూస్తున్న ఆల్బమ్ వైపు దృష్టి సారించాడు. ఆమె కూడా మౌనం వహించటంతో గదిలో తుఫానొచ్చి వెలిసినంత నిశ్శబ్దం పర్చుకుంది.

సాత్విక్ ఓ ఫోటో మీద చూపుడు వేలితో చూపిస్తూ ఆమెతో అన్నాడు.

"దాదాపు పన్నెండేళ్ళ క్రితం నేనొక యాడ్ తయారు చేశాను. అందులో మోడల్ ఈ అమ్మాయి"

మత్తులో మునిచినట్టున్న ఆమె కనురెప్పలను సగం తెరిచి ఆ ఫోటోను చూసి వంకర నవ్వొకటి నవ్వింది విషాదమో మరేదో తెలియని అర్థంతో. ఒకసారి కుర్చీ వెనక్కి వాలి చేతులు పైకెత్తి వొళ్ళు విరుచుకున్న భంగిమలో ఆగిపోయి అంది ఆమె "అయితే మీరిద్దరూ కూడా నన్ను గుర్తుపట్టలేదన్న మాట...ఆ ఫోటోలో ఉన్నది నేనే..మీ యాడ్‌లో మోడల్‌గా నటించిన పాపానికి మోడల్ ప్రపంచపు అంచులు చూడాలని ఆ పిచ్చిలో ఎన్నో మోసాలకు బలై ఆ మాయలోంచి బయటపడలేక ఏవో ఎక్స్‌ట్రా వేషాలు వేసుకుంటూ...బతికున్నప్పుడు మత్తులో ఉంటూ, మత్తులో బతుకుతూ ఉన్నాను"

* * *

నా ముందున్న కాన్వాసుని చించేశాను కసిగా. నా కన్నుల్లో ఓ సన్నటి పొర రాలక...ఇంకక... ఒక దు:ఖాతీత వేదనా భారంతో అలా నిలిచిపోయింది.

మోడల్ ప్రపంచపు గులాబీ ముళ్ళ మాటున అలాంటి అమాయకపు సీతాకోకల రెక్కలు ఎన్నెన్నో రాలి పడ్తున్నాయని తిరిగి రేపుదయించే గులాబీకయినా చెప్పాలని వుంది.